సాక్షి కర్నూలు
మంగళవారం ; 13 ; ఫిబ్రవరి ; 2024



గో సంరక్షణనిధికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి బాపట్లకు చెందిన గొల్లపూడి శ్రీనివాసరావు రూ.1,00,111 విరాళాన్ని సోమవారం అందజేశారు.



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 0.305 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



కరువును జయించిన రైతు

రైతు చింతమాను మల్లికార్జున కప్పట్రాళ్ల ఖ్యాతిని ఢిల్లీకి తీసుకెళ్లాడు. సూక్ష్మ సేద్యంతో కరువు ప్రాంతంలో పండ్లతోటల సాగులో ఈ రైతు అద్భుతంగా రాణిస్తున్నాడు. 8లో▸

న్యూస్‌రీల్

వర్సిటీ ప్రతిష్ట పెంచేందుకు కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగుల అంకన్న

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేస్తానని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగుల అంకన్న అన్నారు. సోమవారం ఆయన నూతన రిజిస్ట్రార్‌గా ప్రస్తుత వర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె. నాయక్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి, ఇతర ప్రొఫెసర్లు, వర్సిటీ నాన్‌టీచింగ్ స్టాఫ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు వర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌ను గాడిలో పెడతామన్నారు. వర్సిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక సెల్

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జీ నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉత్పన్నమైతే ఆయా సమస్యలను తెలియజేసేందుకు వీలుగా తమ కార్యాలయంలో ప్రత్యేకంగా డ్రాట్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీరు బీ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సెల్ ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుందన్నారు. ఎక్కడైనా తాగునీటికి ఇబ్బందులు ఎదురైతే వెంటనే 9652535483, 9618542989 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. వెంటనే ఆయా ప్రాంతాల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. వేసవిలో జిల్లాలో 169 గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని ఇప్పటికే అంచనాకు వచ్చామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని అందించేందుకు రూ.14.98 కోట్లు అవసరమవుతాయని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అయితే ప్రస్తుతం జిల్లాలోని సీపీడబ్ల్యూఎస్ స్కీముల్లో ఎంత నీరు ఉండాలి? ప్రస్తుతం ఎంత నీరు ఉంది ? అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను జిల్లా కలెక్టర్ ద్వారా తమకు పంపించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారన్నారు.

అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియం ప్రవేశాలకు అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లోని వెబ్‌సైట్ https://apbragcet.apcfss.in/ లో ఈ నెల 23వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు అర్హులని డీసీఓ పేర్కొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 244 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు రెండో రోజు సోమవారం 244 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 77 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షల్లో 4,798 మందికి గాను 4,656 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 4,020 మందికి గాను 3,918 మంది హాజరయ్యారు.

నమో నారసింహ



చింతకుంటలో ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: అహోబిలేశుని పార్వేట పల్లకీ ఉయ్యాలవాడ మండలం సర్వాయిపల్లె నుంచి సోమవారం చింతకుంట గ్రామానికి చేరుకుంది. గ్రామ పొలిమేరకు చేరుకున్న ఉత్సవమూర్తులకు సంప్రదాయ ప్రకారం గ్రామ రెడ్డి (వీఆర్వో) బారెడ్డి రాజగోపాల్‌రెడ్డి పెద్ద ఎత్తున గ్రామస్తులతో కలిసి మంగళవాయిద్యాలతో గ్రామ పొలిమేర వరకు ఎదురేగి ఘన స్వాగతం పలికారు. పల్లకీలో కొలువైన ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీని భుజాలపై మోస్తూ మొదటి తెలుపుపై కొలువుంచారు. ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వాములను గ్రామస్తులు బారులు దీరి దర్శించుకున్నారు.

గురు తరుణం

కలల కొలువు సాధించేందుకు మంచి అవకాశం వచ్చింది. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కావడంతో యువతీ, యువకుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. మార్చి 15 నుంచి పరీక్ష నిర్వహించనుండటంతో సాధనపై యువత శ్రద్ధ కనబరుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పోస్టులు ఎక్కువగా ఉండటంతో విజయం సాధిస్తామనే ధీమా చాలా మందిలో కనిపిస్తోంది.



- డీఎస్సీ 2024 నోటిఫికేషన్ విడుదల
- మొదలైన దరఖాస్తు ప్రకియ
- రాష్ట్రంలో అత్యధిక పోస్టులు ఉమ్మడి కర్నూలు జిల్లాకే
- భర్తీ కానున్న 1,022 ఎస్‌జీటీ, 550 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు
- ఈ నెల 22తో ముగియనున్న దరఖాస్తు గడువు
- నోటిఫికేషన్ విడుదలతో హర్షం వ్యక్తం చేస్తున్న యువతీ, యువకులు



కర్నూలు సిటీ/నంద్యాల (న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2024ను సోమవారం జారీ చేసింది. దీంతో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రంలో అత్యధిక భాగం పోస్టులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే భర్తీ కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యలో 5,843 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,693 పోస్టులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో మొత్తం 2,865 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 4.57 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 14,618 మంది ఉధ్యాయులు ఉండాలి. ప్రస్తుతం 11,916 మంది పని చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో ప్రతి స్కూల్‌లో కనీసం ఇద్దరు టీచర్లు ఉండే విధంగా 2024 డీఎస్సీ ద్వారా 1,693 పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది.

ప్రభుత్వ విద్య బలోపేతం

పాఠశాల విద్యలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. నాడు– నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించింది. టీడీపీ హయాంలో 2015–16 నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1905 ఎస్‌జీటీ, 419 స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు ఖాళీగా ఉండగా.. ఎన్నికలకు కొద్ది నెలల ముందు 608 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పోస్టులను భర్తీ చేసింది. అంతేకాకుండా 1998 డీఎస్సీ అభ్యర్థులు 204 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చింది. అలాగే 2008 డీఎస్సీ అభ్యర్థులు 209 మందిని ఉపాధ్యాయులుగా నియమించింది. ప్రస్తుతం 1,693 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది.

డీఎస్సీ 2024 షెడ్యూల్ ఇదీ..

- దరఖాస్తు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది.
- ఫీజు చెల్లింపునకు ఈ నెల 21వ తేది వరకు గడువు ఉంది.
- ఆన్‌లైన్‌లో ఈనెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.
- 24వ తేదీన నమూనా పరీక్ష ఉంటుంది.
- మార్చి 5వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోచ్చు.
- మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ పరీక్ష ఉంటుంది.
- ప్రాథమిక కీ మార్చిన 31న, తుది కీ ఏప్రిల్ 2న విడుదల చేస్తారు.
- ఏప్రిల్ 7వ తేదీన ఫలితాలు వెల్లడిస్తారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాకు వచ్చిన పోస్టులు ఇవీ..

సెంకడరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)	1,012
గిరిజన ప్రాంతాల్లో ఎస్‌జీటీ	10
స్కూల్ అసిస్టెంట్	529
గిరిజన ప్రాంతాల్లో ..	20
ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో..	01
మోడల్ స్కూళ్లలో టీజీటీ	53
బీసీ వెల్ఫేర్‌లో..	11
సోషల్ వెల్ఫేర్‌లో..	20
ట్రైబల్ వెల్ఫేర్‌లో..	27
ఏపీ రెసిడెన్షియల్‌లో..	10
మొత్తం	1,693

ఇవిగాక జోన్–4 (కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప)లో పీజీటీ పోస్టులు 51 భర్తీ చేయనున్నారు.

చాలా సంతోషం



నంద్యాలలో కోచింగ్ తీసుకుంటున్నా. డీఎస్సీలో ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదువుతున్నా. అనుకున్నట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీకి ఆమోదించడం సంతోషంగా ఉంది. జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులు భారీగా ఉన్నాయి. విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.

–పుల్లయ్య, మిట్నాల, నంద్యాల మండలం

హర్షణీయం



డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని ఆశించాం. అనుకున్నట్లుగానే 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయం. నోటిఫికేషన్ ప్రకారం టెట్, డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. నోటిఫికేషన్‌లో ఇచ్చిన విధంగానే సకాలంలో పోస్టులు ఇస్తే నిరుద్యోగుల కల నెరవేరుతుంది.

– ఫయాజ్, నంద్యాల

15న కర్నూలుకు సీఎం వైఎస్ జగన్

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనువడి వివాహానికి హాజరు

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15న కర్నూలుకు రానున్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనువడు పవన్‌కల్యాణ్‌రెడ్డి వివాహానికి ఆయన హాజరు కానున్నారు. ఈ మేరకు సోమవారం సీఎం కార్యాలయం అధికారిక పర్యటనను విడుదల చేసింది.

- 15న ఉదయం 9.30 గంటలకు తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 9.50 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్ ఎయిర్‌పోర్టుకు 10.50 గంటలకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కర్నూలులోని బళ్లారి రోడ్డులో ఉన్న కింగ్ ప్యాలస్ గ్రాండ్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 11.10 గంటలకు చేరుకుంటారు.
- అక్కడ ఐదు నిమిషాలపాటు ప్రజాప్రతినిధులతో ముచ్చటిస్తారు.
- అనంతరం 11.20 గంటలకు కింగ్ ప్యాలస్ గ్రాండ్‌కు చేరుకొని నూతన వధూవరులను ఆశీర్వదీస్తారు.
- 11.35 గంటలకు తిరిగి హెలిప్యాడ్ చేరుకొని 11.45 గంటలకు హెలికాప్టర్‌లో ఓర్వకల్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.
- ఎయిర్‌పోర్టుకు 11.55 గంటలకు చేరుకొని 12 గంటలకు ఓర్వకల్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన ఖరారు కావడంతో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహం జరిగే కింగ్ ప్యాలెస్ గ్రాండ్‌లో భద్రతాపరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడే బారికేడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కల్యాణ మండపానికి సమీపంలోనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



ఇన్‌స్పైర్ మనక్ విజేతలతో జిల్లా విద్యాశాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని జిల్లా విద్యాశాఖ ఏడీ శామ్యూల్ పాల్ సూచించారు. స్థానిక చైతన్య పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలు సోమవారం ముగిశాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 134 నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ .. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. కర్నూలు డిప్యూటీ ఈఓ హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ వినూత్నంగా ఆలోచించి సరికొత్త నమూనాలు ప్రదర్శించాలన్నారు. ఆదోని డిప్యూటీ ఈఓ వెంకటరామిరెడ్డి, ఐఏఎస్ఈ ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సైన్స్ ఫేర్‌లో సృజనాత్మకత, దేశాభివృద్ధికి తోడ్పడే ప్రాజెక్టులను ప్రదర్శించారన్నారు. వివిధ సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ మాట్లాడుతూ.. సైన్స్ ఫేర్‌ను విజయవంతం చేసిన ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతల వివరాలు...

విజేత/ఎంపికైన విద్యార్థి పేరు	పాఠశాల పేరు	ప్రాజెక్టు/ఎగ్జిబిట్/వర్కింగ్ మోడల్ పేరు
పూజారి మనోజ్	కేవీఆర్ జెడ్పీహెచ్ఎస్ మద్దికెర	వాయిస్ కంట్రోల్ ఫర్ హోం అప్లయన్సెస్ లైక్ ఫ్యాన్, లైట్స్
బోయ అంజలి	ఐజీఎంసీ హైస్కూల్ కర్నూలు ఎ.క్యాంప్	ఆల్ ఇన్ వన్ అగ్రికల్చర్ టూల్స్
కె.ఎస్.రిజ్వానా	కులుమాల జెడ్పీ హెచ్ఎస్	ఫింగర్ ప్రింట్ బేస్డ్ ఎగ్జామ్ హాల్ అథెంటికేషన్
జి.నఫా ఉమ్రా	ఉర్దూ గరల్స్ స్కూల్ ఆదోని అండర్‌పేట్	బైసైకిల్ గ్రాస్ కట్టర్
కురువ మల్లేష్	పెద్దపాడు జెడ్పీహెచ్ఎస్	స్మార్ట్ రెస్టారెంట్ విత్ ఈ–మెను కార్డ్
మారం అర్జున్	మాంటిస్సోరి హైస్కూల్ కర్నూలు విద్యానగర్	ఎయిర్ కార్
జె.కుమార స్వామి	పెద్దహరివాణం జెడ్పీహెచ్ఎస్	ఎకో ఫ్రెండ్లీ ఎనర్జీ సేవింగ్ ఫ్రిడ్జ్
జి.సిద్ధార్థ	ఆర్.కొంతలపాడు జెడ్పీహెచ్ఎస్	ఎయిర్ అండ్ సౌండ్ పొల్యూషన్ మానిటరింగ్ సిస్టమ్
ఈడిగ వీరాంజనేయులు	పెద్దకడుబూరు జెడ్పీహెచ్ఎస్	ఓటర్ క్రెడెన్షియల్ యూజింగ్ ఆర్ఎఫ్ఐడీ టెక్నిక్
షకీరా షాహిన్ బి	పెంచికలపాడు జెడ్పీహెచ్ఎస్	జీరో ఎనర్జీ కూలింగ్ ఛాంబర్
మురువేణి వర్షిత	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(గరల్స్) ఆరెకల్	రిమైండింగ్ ది ఓనర్ ఇఫ్ కీన్ ఆర్ ఫర్‌గాట్ ది వెహికల్
సాఖబర్ రహిమాన్	కర్నూలు సిస్టర్ స్టాన్సిలాస్	ఎకోబ్రిక్స్ ఇన్ ఎ సస్టైనబుల్ వే
జి.ఝాన్సీరాణి	మదిరె జెడ్పీహెచ్ఎస్	రైస్ స్ట్రా ఫ్రం పొల్యూషన్ టు సస్టైనబులిటీ
బోయ పసుల జయసూర్య	మీదివేముల జెడ్పీహెచ్ఎస్	మేకింగ్ ఎ మాగ్నెట్ క్రేన్

ముగిసిన సమగ్ర కులగణన



కర్నూలులో కులగణనను చేస్తున్న వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సోమవారంతో ముగిసింది. కర్నూలు జిల్లాలో 89.07 శాతం కుటుంబాల కులం, ఇతర వివరాలను ఎన్యూమరేటర్లుగా వ్యవహరించిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సేకరించారు. జిల్లాలో 7,34,908 కుటుంబాల్లో 24,51,232 మంది నివాసం ఉంటుండగా 6,54,987 కుటుంబాల్లోని 20,01,100 మంది తమ కులం వివరాలను చెప్పారు.

17లోపు నమోదు చేసుకునే అవకాశం...

జిల్లాలో దాదాపు 90 శాతం కులగణన పూర్తి అయిందని చెప్పవచ్చు. అయితే మిగిలిన 10 శాతం కుటుంబాలు అందుబాటులో లేకపోవడంతో వారి వివరాలను సేకరించలేదు. ఇందులో వలస వెళ్లిన వారు ఎక్కువగా ఉండగా..కురువ, కురుబలను తమను మదారి/మదారి కురువగానమోదు చేయాలని కోరుతూ సర్వేలో పాల్గొనలేదు. ఈ క్రమంలో సర్వేలో పాల్గొనని వారు తమ వివరాలను 17వ తేదీ లోపు సమీపంలోని సచివాలయానికి వెళ్లి నమోదు చేసుకోవచ్చు. లేదంటే వారి వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించి ప్రభుత్వానికి పంపుతారు.

రుణాలు రికవరీ చేస్తారా.. సరెండర్ చేయమంటారా?

- డీసీసీబీ సిబ్బందిపై సీఈఓ శివశీల ఆగ్రహం



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈఓ శివశీల

ఆలూరు: రుణాలు రికవరీ చేస్తారా లేదంటే సరెండర్ చేయమంటారా అంటూ ఆలూరు కేంద్ర సహకార బ్యాంకు సిబ్బందిని డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈఓ శివశీల హెచ్చరించారు. ఆలూరులోని డీసీసీబీ బ్రాంచ్‌లో సోమవారం బ్రాంచ్‌మేజర్లు రవిప్రకాష్, సరస్వతి సమక్షంలో సూపర్‌వైజర్లు, సహకార పరపతి సంఘాలకు చెందిన సీఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలూరు నియోజకవర్గంలోని 5 సహకార పరపతి సంఘాలు, బ్యాంకు ద్వారా 2022–23లో రూ. 70 కోట్లు దీర్ఘకాలిక, స్వల్పకాలిక, మధ్యకాలిక రుణాలను మంజూ రు చేశామన్నారు. అయితే రూ. 9 కోట్లు మాత్రమే రికవరీ చేశారన్నారు. విధులు నిర్వహిస్తున్నారా? కాలయాపన చేస్తున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలాఖరిలోపు రుణాలను రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీజీఎం ఉమామహేశ్వరిరెడ్డి, రుణాల రికవరీ అధికారి జయప్రకాష్ పాల్గొన్నారు.

వినియోగదారులకు '1967' బ్రహ్మాస్త్రం

- 1967 నంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్
- పౌరసరఫరా, తూనికలు–కొలతల శాఖల్లో మోసాలక్ చెక్
- సమస్యలు ఉన్న వారు ఫిర్యాదు చేస్తే పరిష్కారాలు లభ్యం

కర్నూలు(సెంట్రల్): గుండు పిన్ను నుంచి గూగుల్ సేవల వరకు..పాల నుంచి ఫార్మా కంపెనీల కల్తీ వరకు...రియల్ ఎస్టేట్ మోసాల నుంచి కార్పొరేట్, ఈ–కామర్స్ సంస్థల దోపిడీ వరకు...ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా..వస్తువుల్లో నాణ్యతా లోపించినా..వినియోగదారులు ఏమి చేయలేని పరిస్థితి. అలాంటి వారి చేతికి రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మాస్త్రం అందిస్తోంది. ఫిర్యాదులు, వినతులు, సలహాల కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. 1967 నంబర్‌తో రాష్ట్ర పౌర సరఫరాల కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. ఎవరికైనా వస్తు సేవలను పొందడంలో ఇబ్బంది ఉంటే నేరుగా 1967 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సరిపోతుంది.

టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ...

గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రజలు, వినియోగదారుల, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కొనే వారి సమస్యలను పరిష్కరించేందుకు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఫిర్యాదులను18004250082/1967 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు, ఒకే దేశం.,.ఒకే రేషన్ కార్డు ఫిర్యాదులకు 18004253157/14445 అనే టోల్ ఫ్రీ నంబర్, రాష్ట్ర ఆహార కమిషన్‌కు ఫిర్యాదుల, సలహాలు,సూచనలు చేసుకునేందుకు 18004252388/155235 అనే టోల్‌ఫ్రీ నంబర్, తూనికలు, కొలతల శాఖకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 18004254205 అనే టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరి చేయడానికి బదులు మరో శాఖకు వెళ్లేవి. అంతేకాక వినియోగదారులు అన్ని నంబర్లకు గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 అనే నంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఎలాంటి ఫిర్యాదుల చేయవచ్చు...

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు వినియోగదారుల, వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖకుసంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులను చేయవచ్చు. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో తూకాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికల కొలతలు, బియ్యం కార్డు సేవలపై ఫిర్యాదులు చేయవచ్చు. అదేవిధంగా సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. చేసిన ఫిర్యాదును సంబంధిత శాఖల పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేకాక నిర్దేశించిన సమయం తరువాత ఫిర్యాదు ఏ దేశలో ఉన్నదో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నదో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి



వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఇంటిగేటెడ్ కాల్ సెంటర్‌ను 1967 నంబర్‌తో ఏర్పాటు చేసింది. ఇది ఉదయం నుంచి సాయంత్రం 8 గంటలకు అందుబాటులో ఉంటుంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వస్తు సేవల్లో ఇబ్బందులు ఉంటే నేరుగా కాల్ చేసి ఫిర్యాలు చేయవచ్చు.

– నారపురెడ్డి మౌర్య, జేసీ, కర్నూలు

సంక్షేమ బావుటా

జగనన్నకు రుణపడి ఉంటాం



నేను ఇందిర పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. మాకెలాంటి పొలాలు లేవు. కొడుకు, కూతురు ఉన్నారు. నా భర్త మహమ్మద్‌రఫితో కలిసి కూలీ పనులు చేసుకొని జీవనం గడిపేవాళ్లం. ఇందిర పొదుపు సంఘంలో గత ఎన్నికల ముందు 10 సభ్యులం రూ.5లక్షలు రుణం తీసుకున్నాం. జగనన్న సీఎం అయ్యాక నాలుగు విడతలో రుణం మాఫీ అయ్యింది. ఒక్కో విడతలో రూ.10,300 చొప్పున నాలుగు విడతల్లో రూ.41,200 వచ్చింది. మాఫీ సొమ్ముతో ఇంటి వద్దే చిన్న పాటి హోటల్ నడుపుకుంటున్నా. రోజూ కూలి పాటు గిట్టుబాటు అవుతోంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– కొలిమి రసూల్‌బీ, డ్వాక్రా సభ్యురాలు, రామాపురం, తుగ్గలి మండలం

ప్రతి నెలా ఉచితంగా మందులిస్తున్నారు



నేను కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. నాకు కొన్నేళ్ల నుంచి బీపీ ఉంది. గతంలో బయట షాపులో కొనుక్కొని మందులు వాడేవాడిని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 104 అంబులెన్స్ మా ఊరికి వస్తోంది. అంబులెన్స్‌లో వైద్యులు బీపీ వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇస్తున్నారు. గతంలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలంటే గడివేములకు లేదంటే నంద్యాలకు వెళ్లాల్సిన ఉండేది. ఇప్పుడు ఊర్లోనే పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు ఇస్తుండటంతో చాలా సంతోషంగా ఉంది.

– నాగన్న, బూజునూరు గ్రామం, గడివేముల మండలం

పెద్దాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్సలు

- నూతన పద్ధతులతో ఆపరేషన్ చేసి ప్రాణం పోసిన వైద్యులు



కోలుకున్న సువర్ణతో వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ విభాగం ఆరో యూనిట్‌లో అక్కడి వైద్యులు నలుగురు రోగులకు అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారంయూనిట్ చీఫ్ డాక్టర్ మాధవీ శ్యామల వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే.. ''కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన సువర్ణ(35)కు కాలేయంలో రక్తపు గడ్డ ఏర్పడింది. వైద్యపరిభాషలో దీనిని లివర్ ఎయాంజియోనా అంటారు. ఈ కారణంగా కాలేయానికి చిన్న గాయమైనా కూడా గాయం రక్తం ఆగకుండా వచ్చి ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉంది. దీనిని సాధారణంగా లివర్ టెక్షన్ ఆపరేషన్ ద్వారా తొలగిస్తారు. ఇది చాలా పెద్ద ఆపరేషన్. అలా కాకుండా ఈ నెల 2వ తేదిన ట్రాన్స్ ఆర్టిరియర్ కీమో ఎంబోలైజేషన్ పద్ధతి ద్వారా కాలిలోని దమని నుంచి కేథటర్ పంపించి కాలేయంలోని గడ్డకు మందు ఇంజెక్ట్ చేస్తాం. ఈ తరహా పద్ధతి మన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మొట్టమొదటిసారిగా నిర్వహించాం. దీనిని రేడియాలజి హెచ్‌వోడి డాక్టర్ రాధారాణి, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టు డాక్టర్ అరుణ్, అనెస్తెటిస్ట్ డాక్టర్ కొండారెడ్డితో పాటు జనరల్ సర్జరీ వైద్యుల బృందం డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ జయరామ్, డాక్టర్ శృతి, డాక్టర్ చంద్రారెడ్డి, డాక్టర్ సృజన నిర్వహించారు.

➡ తెలంగాణా రాష్ట్రంలోని రాజోలి ప్రాంతానికి చెందిన శిల్పలత(17)కు ప్లీహం పెద్దగా పెరిగిపోయింది. దీనివల్ల కాలేయంలోని నరాలు ఒత్తిడికి గురై పోర్టల్ హైపర్ టెన్షన్‌గా మారింది. దీంతో క్రమంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఆమెకు ఈ నెల ఒకటో తేదిన స్ప్లినెక్టమి చేసి ప్లీహాన్ని తొలగించాం.

➡ కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన అఫ్రీనా(15)కు అన్నవాహికలో అల్సర్ ఏర్పడింది. ఆమెకు ఈ నెల 2న ఆర్గాన్ ప్లాస్మా లేజర్ పద్ధతిలో చికిత్స చేయడంతో ఆమె కోలుకుంది.

➡ పుట్టపర్తికి చెందిన నాగప్ప(88)కు మలద్వారం బయటకు వచ్చింది. స్థానికంతో పాటు అనంతపురంలోనూ ఆయన చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేరాడు. అతనికి ఈ నెల 6న డెలారోమ్స్ ప్రొసీజర్ ద్వారా మలద్వారం గుండా ఆపరేషన్ చేసి నయం చేశాం' అని డాక్టర్ మాధవీశ్యామల తెలిపారు.

జగదుర్తి సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు

డోన్ టౌన్:ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో జగదుర్తిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు జోనల్ మేనేజర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర చదరపు మీటరుకు రూ.1,119 గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు www. apiic. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182237558ను సంప్రదించాలన్నారు.

ఫ్లెక్సీ చాటున టీడీపీ నీచ రాజకీయం

- డోన్‌లో ధర్మారం సుబ్బారెడ్డి ఫ్లెక్సీల తొలగింపు
- అధికార పార్టీపై నెపం నెట్టే ప్రయత్నం
- పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి
- నలుగురు నిందితుల అరెస్ట్
- నిందితులు కోట్ల, కేఈ అనుచరులు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్: ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు ప్రజల్లో సానుభూతి పొందాలని చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి మూడు రోజుల క్రితం తన ఫ్లెక్సీలు చించేశారని పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి హంగామా చేశారు. తన ఫ్లెక్సీలను చించిన వారిని అరెస్టు చేయకపోతే డోన్‌లో ప్రత్యర్థి వర్గానికి చెందిన ఒక్క ఫ్లెక్సీని కూడా ఉండనివ్వనని హెచ్చరించారు. కాగా పోలీసులు విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావడంతో టీడీపీ నీచ రాజకీయం మరోసారి బయటపడింది. ఇటీవల డోన్ పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించేస్తున్నారు. కాగా దీని వెనుక సొంత పార్టీ కార్యకర్తలే ఉండటంతో ఆయన గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లుగా మారింది. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ముఖ్య అనుచరుడు విష్ణువర్ధన్ రెడ్డి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ సంఘటనపై ఇద్దరు నేతలు ఎలా స్పందిస్తారనే దానిపై నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

నలుగురు అరెస్టు..

టీడీపీ నేత ధర్మారం సుబ్బారెడ్డి ఫ్లెక్సీలను చించివేసిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కన్నపకుంట గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, ఈడిగ రవికుమార్ అలియాస్ పాల రవి, ఎరుకలి పవన్ కుమార్ అలియాస్ పవన్, చింతమాను తిరుమల రంగస్వామి అలియాస్ రంగా ఉరఫ్ రఫి అనే నలుగురు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు సీసీ పుటేజీల ఆధారంగా నిర్ధారించామన్నారు. ఈ మేరకు నలుగురిని అదుపులోకి తీసుకొని విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్మీ ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ఆర్మీ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్ రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు బాలాజీనగర్‌కు చెందిన తాహెరా, సాజిదా ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా స్పందనకు 76 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు తదితరులు కూడా స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

☛ వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి వంటి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నెల్లూరుకు చెందిన విజయనిర్మల, ఆమె భర్త సుధాకర్, విజయవాడకు చెందిన గీత కలసి ఒక్కొక్కరి నుంచి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.26 లక్షలు డబ్బులు తీసుకుని నకిలీ ఆర్డర్ కాపీలు ఇచ్చి తనను మోసం చేశారని ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన చిన్న తిక్కయ్య ఫిర్యాదు చేశారు.

☛ ఫానుక్ ఇండియా పేరుతో తాను ఆన్‌లైన్ బిజినెస్ చేస్తుంటే గుర్తు తెలియని వ్యక్తులు తన ఖాతా నుంచి రూ.80 వేలు కాజేశారని,విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన హెబ్సిబా కోరారు.

☛ తన కుమారుడు అన్నం పెట్టకుండా, బాగోగులు చూసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, విచారణ జరిపి న్యాయం చేయాలని కుమ్మరి వీధికి చెందిన నాగరాజు విన్నవించారు.

☛ మామిదాలపాడు గ్రామంలో ధోబీఘాట్ స్థలంలోకి కొంతమంది అక్రమంగా ప్రవేశించారని, విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన మల్లికార్జున కోరారు.

☛ తన ఇంటికి రస్తా లేకుండా కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆస్పరి గ్రామానికి చెందిన షేక్షావలి ఫిర్యాదు చేశారు.

☛ తన పొలాన్ని అన్యాయంగా రిజిష్టర్ చేసుకోవాలని సాగులో ఉన్న జొన్న పంటను కొందరు వ్యక్తులు దొంగలించారని హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన మహేష్ ఫిర్యాదు చేశారు.

భారీగా సారా బెల్లం స్వాధీనం

- రెండు వాహనాలు సీజ్
- ముగ్గురు రవాణాదారుల అరెస్టు



పట్టుబడిన వాహనాలను చూపుతున్న పోలీసులు

కర్నూలు: సెబ్ అధికారులు సోమవారం భారీగా సారా బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలు సీజ్ చేసి, ముగ్గురు రవాణాదారులను అరెస్ట్ చేశారు. సెబ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ప్యాపిలి మండలం పీఆర్ పల్లె నుంచి తుగ్గలి మండలం రోళ్లపాడు తాండ పరిసర ప్రాంతాల్లోని మరికొన్ని తాండాలకు భారీ ఎత్తున సారా బెల్లం రవాణా జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో పత్తికొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ సువర్ణలత, ఎస్ఐ కార్తీక్ సాగర్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రోళ్లపాడు తండగా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ప్యాపిలి వైపు నుంచి వచ్చిన రెండు బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా అందులో నాటు సారా తయారీకి ఉపయోగించే 250 సంచుల్లో 7 వేల కిలోల బెల్లం కనిపించింది. వాహనాల్లో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా పీఆర్ పల్లె నుంచి రోళ్లపాడు తాండాకు తరలిస్తున్నట్లు తెలిపారు. బెల్లంతో పాటు వాహనాలను సీజ్ చేసి రవాణాదారులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులు పారిపోయారని, వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వరదరాజులు, సర్దార్ హుసేన్, మదనమోహన మాలవ్య, ఈరన్న, వెంకటేశ్వర్లు, రాణి, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

- ఒకరు అరెస్ట్



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయంలో పట్టుబడిన మద్యాన్ని చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామం దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎమ్మిగనూరు పట్టణం ఎన్టీఆర్ కాలనీకి చెందిన గౌస్ మహమ్మద్ సైఫుల్లా బైక్‌పై 480 (90 ఎంఎల్) ఒరిజినల్ ఛాయిస్ కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ కనిపించాడన్నారు. వాహనాన్ని, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.22,500 ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ గోపాల్, పీసీలు లక్ష్మణ్, నరసింహారెడ్డి, భరత్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

నందవరం: నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద 768 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. కనకవీడుపేట గ్రామానికి చెందిన మేకల తిమ్మప్ప, రాజ్‌కుమార్‌లు ఇద్దరూ ఈ మద్యాన్ని బైక్‌పై తరలిస్తుండగా దాడులు చేశామన్నారు. రాజ్‌కుమార్ పరార్ అయ్యాడని, తిమ్మప్ప నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మాజీ మంత్రి బంధువు హల్‌చల్

- కారుకు ఆటో అడ్డు వచ్చిందని డ్రైవర్‌పై మహిళ చెప్పుతో దాడి
- అవమాన భారంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం
- మహిళ ఇంటి ఎదుట సీఐటీయూ నాయకుల ధర్నా



చికిత్స పొందుతున్న ఓబులేసు



శివానందమ్మ ఇంటి ముందు ధర్నా చేస్తున్న బాధితులు, సీఐటీయూ నాయకులు

బొమ్మలసత్రం: టీడీపీ నేత, మాజీమంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి సమీప బంధువు శివనాగిరెడ్డి భార్య శివానందమ్మ సోమవారం నంద్యాల పట్టణంలో హల్‌చల్ చేశారు. తన కారుకు ఆటో అడ్డు వచ్చిందని ఆటో డ్రైవర్‌పై చెప్పుతోదాడి చేశారు. నంద్యాల మండలం బాబానగర్ గ్రామానికి చెందిన ఓబులేసు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం నూనెపల్లి సర్కిల్‌లో ఒక రోగిని పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు బాడుగ కుదుర్చుకున్నాడు.ఆ ప్రాంతం రద్దీగా ఉండటంతో ఓబులేసు ఆటోలో తీసుకొచ్చిన రోగి కిందకు దిగేందుకు కాస్త సమయం తీసుకున్నాడు. ఆ దారిలో మాజీమంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి సమీప బంధువు శివనాగిరెడ్డి భార్య శివానందమ్మ కారులో వస్తుండగా ఆటో అడ్డుగా ఉందని కారు డ్రైవర్ హారన్ కొట్టాడు. ఆటోలో నుంచి రోగి దిగుతున్నాడని, ఒక్క నిమిషం వేచి ఉండాల్సిందిగా ఓబులేసు కోరాడు. ఇంతలో శివానందమ్మ ఆగ్రహంతో ఊగిపోయి కారులో నుంచి దిగి ఆటో వద్దకు వెళ్లి ఓబులేసును దుర్భాషలాడింది. ఓబులేసు ఆమెకు సర్దిచెప్తున్నా వినకుండా తన కాలి చెప్పుతో దాడి చేసింది. ఒక మహిళ చెప్పుతో నడిరోడ్డుపై కొట్టిందన్న అవమానంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపాడు. ఇది పట్టించుకోకుండా శివనందమ్మ అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయింది. అవమానంగా భావించిన ఓబులేసు సమీపంలోని ఎరువుల దుకాణంలో పురుగు మందు డబ్బా కొనుగోలు చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఓబులేసును స్థానికులు చికిత్సనిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెసుకున్న కుటుంబ సభ్యులు, సీఐటీయూ నాయకులు శివానందమ్మ ఇంటి ముందు బైఠాయించారు.బాధిత కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసినప్పటికీ లాభం లేకపోయింది. ధన బలంతో శివానందమ్మ తన తండ్రిపై దాడి చేసిందని బాధితుని కుమార్తె స్వప్న వాపోయింది. చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యూనియన్‌ను నడిపిస్తున్నది కార్మికులే

- 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



రక్త దానం చేస్తున్న ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): ఏడున్నర దశాబ్దాల కాలంలో 1104 యూనియన్ ఎన్నో విజయాలను సొంతం చేసుకుందని, యూనియన్‌ను ముందుండి నడిపిస్తున్నది కార్మికులేనని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్(1104) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య అన్నారు. యూనియన్ 75వ వసంతంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాలను స్థానిక విద్యుత్ భవన్‌లో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ట్రాన్స్‌కో ఎస్ఈ(ప్రాజెక్టులు) కేవీ రామకృష్ణ, ఎస్ఏఓ రాఘవులు ఆయా కార్యక్రమాలను సంయుక్తంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా మొత్తం 180 ఉద్యోగులు రెడ్‌క్రాస్ సొసైటీకి రక్తదానం చేశారు. 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ సంస్థల అభివృద్ధికి యూనియన్ అన్ని విధాల సహకరిస్తుందని.. ఇదే సమయంలో ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కర్నూలు 1104 ప్రాంతీయ శాఖ అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి బీఎన్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుమలయ్య, విజయేంద్రచారి, మహేశ్వరరెడ్డి, వివిధ డివిజన్‌ల నేతలు పాల్గొన్నారు.

గడువులోపు అర్జీలను పరిష్కరించాలి



ప్రజల సమస్యలు వింటున్న డీఆర్వోమధుసూధన్‌రావు

కర్నూలు(సెంట్రల్): నిర్దేశించిన సమయంలోపు జగనన్నకు చెబుదాం–స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కరించాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జగనన్నకు చెబుదాం–స్పందనలో భాగంగా జిల్లా అధికారులతో కలసి ఆయన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలన్నారు. స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా తగిన ఎండార్స్‌మెంట్ అందజేయడంతో పాటు అర్జీదారులను నేరుగా కలుసుకొని వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్యను పరిష్కరించలేకపోతే అందుకు తగిన కారణాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం





మృతి చెందిన హర్షవర్ధన్, సుబ్బరాయుడు (ఫైల్)

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు రహదారిలో సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్వటాలకు చెందిన యువకుడు గూడూరు హర్షవర్ధన్ (25) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సొంత పని నిమిత్తం బైక్‌పై కొలిమిగుండ్ల సమీపానికి చేరుకున్నాడు. అదే సమయంలో కొలిమిగుండ్లకు చెందిన కుమ్మరి సుబ్బరాయుడు(50) బైక్‌కు పెట్రోల్ వేయించుకునేందుకు బంక్ వద్దకు బయలు దేరాడు. ఈ క్రమంలో జమ్మలమడుగు రోడ్డులో ఓ దాబా సమీపంలో రెండు బైక్‌లు ప్రమాదవశాత్తూ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడిని స్థానికులు చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. సుబ్బరాయుడు కొలిమిగుండ్లలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, అతని కుమారుడు సుధాకర్ హైదరాబాద్‌లో చిన్న వ్యాపారం నిర్వహించుకుంటు అక్కడే ఉంటున్నాడు. ప్రమాద ఘటనపై సీఐ గోపీనాథ్‌రెడ్డి వివరాలు ఆరా తీశారు. ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

బైక్ రిపేరీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్):కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు బైక్ రిపేరీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 5 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. చదవడం, రాయడం వచ్చి ఉండా లని తెలిపారు. శిక్షణ కాలంలో భోజనంతోపాటు హాస్టల్ వసతి కల్పిస్తామని,ఆసక్తి కలిగిన యువకులు మరిన్ని వివరాలకు 63044 91236 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రాక

కర్నూలుకల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ సర్వోన్నత అధికారి (ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్) మోహన్ భగవత్ మంగళవారం కర్నూలు రానున్నారు. రెండు రోజుల పర్యటనలో ఈయన ఆర్‌ఎస్‌ఎస్ చేపట్టే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల మైదానంలో జరిగే విశేష నగర సాంఘిక్ కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు. బుధవారం జరిగే సమావేశంలో ఉమ్మడి జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యతలు నిర్వర్తించే నాయకులకు ఆర్‌ఎస్‌ఎస్ పటిష్టం చేసే అంశాలపై మార్గదర్శనం చేయనున్నారు. గణవేష కలిగిన వారిని మాత్రమే సమావేశాలకు అనుమతిస్తారు.

కరువును జయించిన కప్పట్రాళ్ల రైతు

- సూక్ష్మసేద్యంతో 30 ఎకరాల్లో చీనీ తోటల అభివృద్ధి
- అంతర పంటగా మిరప సాగు
- జనవరి 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న రైతు



ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు చింతకాయల మల్లికార్జున



చీనీ తోటలో మల్లికార్జున

కర్నూలు(అగ్రికల్చర్): కరువు ప్రాంతమైన దేవనకొండ మండలంలో సూక్ష్మ సేద్యం సాయంతో ఓ రైతు బంగారు పంటలు పండిస్తున్నాడు. చదువుకున్నది 10వ తరగతే అయినా పండ్లతోటల సాగులో అపారమైన అనుభవం గడించాడు. సూక్ష్మసేద్యంతో 30 ఎకరాల్లో చీనీ తోటలను అభివృద్ధి చేసి ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచాడు. జనవరి 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని కేంద్ర మంత్రికి తన విజయగాథ వినిపించారు చింతమాను మల్లికార్జున. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామంగా ఉండేది. కక్షలు, కార్పణ్యాలతో ప్రజలు వ్యవసాయంపై దృష్టి సారించలేకపోయేవారు. వర్షాభావ పరిస్థితులతో సాగు ఆశాజనకంగా ఉండేది కాదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ప్రజల్లో వచ్చిన మార్పుతో ఈ గ్రామంలో ప్రస్తుతం ఫ్యాక్షన్ లేదు. రైతులు సైతం వివిధ పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామానికి చెందిన చింతమాను మల్లికార్జున తనకున్న 30 ఎకరాల పొలాన్ని చీనీ తోటలను అభివృద్ధి చేసుకుని దేశ రాజధానికి కప్పట్రాళ్ల ఖ్యాతిని తీసుకెళ్లాడు. ఈయన ఏడేళ్ల క్రితం 6 ఎకరాలు, రెండేళ్ల క్రితం 14 ఎకరాలు, ఏడాది క్రితం 10 ఎకరాల్లో చీని సాగు చేశాడు. మొత్తం 10 బోర్లు ఉండగా.. ఈ ఏడాది వర్షాలు ఆశించినంతగా కురవకపోయినా సూక్ష్మ సేద్యం సదుపాయంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట తీశాడు. ఈయన గతంలో అరటి, బొప్పాయి, ఇతర కూరగాయల పంటలు సాగు చేసేవాడు. ప్రస్తుతం 30 ఎకరాల్లోను చీనీ తోటలు సాగు చేస్తూ.. అంతరపంటగా ఆర్మూర్ వెరైటీ మిర్చి పండిస్తున్నాడు. మిర్చిలో ఇప్పటికే 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మరో 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో..

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈయన పండ్లతోటల సాగులో రాణిస్తున్నాడు. ఏపీఎంఐపీ ద్వారా సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించుకున్నాడు. ఈ ఏడాది చీనీ(స్వీట్ ఆరంజీ) తోటలను రూ.9 లక్షలకు విక్రయించాడు. సూక్ష్మ సేద్యంలో విశేషంగా రాణిస్తున్న చింతమాను మల్లికార్జునను సతీసమేతంగా రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26న రిపబ్లిక్ డేను పురస్కరించుకొని ఢిల్లీకి పంపింది. రాష్ట్రం మొత్తం నుంచి 10 మంది రైతులు వెళ్లగా.. ఇందులో మల్లికార్జున ఒకరు కావడం విశేషం. దేశ రాజధానిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని కేంద్ర వ్యవసాయ మంత్రితో ముఖాముఖి మాట్లాడారు. సూక్ష్మ సేద్యం వినియోగించుకొని తాను ఎలా రాణిస్తున్నది వివరించారు.